AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
28-5-2026 (Thursday) MAIN EDITION

## నాలుగు రాష్ట్రాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం




**అక్షరటుడే, ఢిల్లీ:** బీజేపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ నూతన అధ్యక్షులను ప్రకటించింది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రాను నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కేవల్ సింగ్ ధిల్లాన్ పేరును ప్రకటించింది. హర్యానా అధ్యక్షురాలిగా అర్చనా గుప్తా, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేబ్‌రాయ్‌ని నియమించింది. ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది.

## 'ఎగ్జిబిటర్ల' వివాదానికి పరిష్కారం


**అక్షరటుడే, హైదరాబాద్:** ఇండస్ట్రీకి ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానని మరోసారి మెగాస్టార్ చిరంజీవి నిరుపించారు. టాలీవుడ్‌లో కొన్ని రోజులుగా నడుస్తున్న 'రెంటల్ వర్సెస్ పర్సెంటేజ్' వివాదానికి చిరు జోక్యంతో తెర పడింది. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో చిరంజీవి వేర్వేరుగా తన నివాసంలో సమావేశం అయ్యారు. మూడు రంగాల ప్రతినిధులను ఒకే తాటిపైకి తెచ్చారు. మెగాస్టార్ హామీతో జూన్ 30 వరకు ప్రస్తుత 'రెంటల్ విధానం' కొనసాగించేందుకు తెలంగాణ ఎగ్జిబిటర్లు అంగీకరించారు. అప్పటిలోపు 'పర్సెంటేజ్ విధానం'పై చాంబర్ కమిటీ ద్వారా శాశ్వత పరిష్కారం చూపిస్తామని చిరంజీవి భరోసా ఇచ్చారు. కాగా జూన్ 4న రామ్‌చరణ్ నటించిన పెద్ది మూవీ విడుదల కానుంది.

## లక్షద్వీప్‌కు చేరిన రుతుపవనాలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ప్రస్తుతం లక్షద్వీప్, ఆగ్నేయ అరేబియా సముద్రం, బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించాయని ఐఎండీ తెలిపింది. వాస్తవానికి, ఈ నెల 26నే కేరళకు చేరాల్సి ఉన్నా ఆలస్యమయ్యాయి. సాధారణంగా జూన్ 1న కేరళ తీరాన్ని తాకి.. ఆ తర్వాత వారం రోజుల్లో తెలుగు రాష్ట్రాలకు విస్తరిస్తాయి.

## 'సీయూఈటీ-యూజీ' పరీక్ష తేదీలివే..



**అక్షరటుడే, ఢిల్లీ:** 'సీయూఈటీ-యూజీ 2026' పరీక్షలకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ ప్రవేశ పరీక్షల సవరించిన షెడ్యూల్‌తో పాటు అడ్మిట్ కార్డులను అధికారికంగా విడుదల చేసింది. పరీక్షలను ఈ నెల (మే) 31వ తేదీన, అలాగే వచ్చే నెల (జూన్) 6, 7 తేదీలలో దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు.

## ముస్లింల సంక్షేమానికి కృషి




**అక్షరటుడే, నల్గొండ:** సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అభివృద్ధి, సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండ పట్టణంలోని మునుగోడు రోడ్డు ఈద్గాలో నిర్వహించిన బక్రీద్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## వడ్లు కొనడం లేదని సొసైటీకి తాళం వేసి నిరసన




**అక్షరటుడే, సిరిసిల్ల:** రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో ఇంకా 50 శాతం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. దీంతో రైతులు ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రైతులు ఆందోళన చేస్తున్నారు. ఎర్రటి ఎండలను లెక్ చేయకుండా రోడ్డుపై ధర్నాలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. లారీలు రాక ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ క్రమంలో ఓ కాంగ్రెస్ నేత సొసైటీ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు.

## సీబీఎస్ఈ పేపర్ల రీవాల్యుయేషన్



**అక్షరటుడే, ఢిల్లీ:** సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షల వాల్యుయేషన్‌లో తలెత్తిన సాంకేతిక లోపాలు, వ్యత్యాసాలపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సంచలన ప్రకటన చేశారు. మూల్యాంకనంలో తప్పులు దొర్లినట్లు అంగీకరించిన ఆయన దీనికి పూర్తి బాధ్యత తానే వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగకుండా సీబీఎస్ఈ 12వ తరగతి పేపర్ల రీ వాల్యువేషన్‌కు ఆదేశించామని ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని స్పష్టం చేశారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. విద్యార్థులెవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

# సిద్ధరామయ్య రాజీనామా



కర్ణాటకలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. కొన్ని రోజు లుగా సీఎం మార్పుపై వస్తున్న ప్రచారానికి ఎట్టకేలకు తెర పడింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి నేడు రాజీ నామా చేశారు. గవర్నర్ సెక్రెటరీకి రాజీ నామా లేఖ అందజేశారు. తన వార సుడిగా డీకే శివకుమార్‌ను ప్రతిపాదించారు. అధిష్టానం సూచన మేరకు రాజీనామా చేశానని తెలిపారు.

–అక్షరటుడే, నేషనల్ డెస్క్

■ కర్ణాటకలో మారిన రాజకీయ సమీకరణాలు ■ నూతన సీఎంగా డీకే శివకుమార్! ■ శనివారం ప్రమాణ స్వీకారం చేసే అవకాశం

సుమారు ఐదు దశాబ్దాల పాటు సాగిన తన విశిష్ట రాజకీయ ప్రస్థానానికి ముగింపు పలుకుతూ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. మే 28న బెంగళూరులోని తన అధికారిక నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందు సందర్భంగా తన మంత్రివర్గ సహచరులకు రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. అనంతరం మధ్యాహ్నం గవర్నర్ కార్యాలయానికి వెళ్లి తన రాజీనామా అందజేశారు.

### అధిష్టానం సూచనలతో..

సిద్ధరామయ్య గురువారం ఉదయం మంత్రులతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. సమావేశానికి హాజరైన డీకే శివకుమార్ సీఎంను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సమావేశంలో సిద్ధరామయ్య తన రాజీనామా నిర్ణయాన్ని మంత్రులకు వివరించారు. తాను మనస్ఫూర్తిగా రాజీనామా చేస్తున్నాని ప్రక టించారు. నాకు ఎలాంటి బాధ లేదు.. మీ అందరి సహకారానికి కృతజ్ఞతలు.. హైకమాండ్ నన్ను సీఎం పదవికి రాజీనామా చేయమని కోరిందని తెలిపారు.

### కొత్త సీఎంగా..

కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పేరును సిద్ధరామయ్య ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ మేరకు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో సిద్ధూ ఈ ప్రతిపాదనలు చేసినట్లు రాష్ట్ర మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు. కొత్త సీఎం శనివారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

### శివకుమార్ ఇంటి వద్ద భారీ భద్రత

ముఖ్యమంత్రి రాజీనామా వేళ డీకే శివకుమార్ నివాసం వద్ద భారీగా భద్రత ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు, పోలీసుల మోహరించారు. సిద్ధరామయ్యకు తదుపరి వారసుడిగా ఎవరు బాధ్యతలు స్వీకరించాలనే విషయంపై పేరును ఖరారు చేయడం లేదా ఎన్నిక నిర్వహించడం జరిగే కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశం, శుక్రవారం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. డీకే శివకుమార్‌ను శాసనసభ పక్ష నేతగా ఎన్నుకోనున్నట్లు సమాచారం. కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం డీకే శివకుమార్ తీవ్రంగా కృషి చేశారు. దీంతో ఆయనకే సీఎం పదవి వస్తుందని అంతా భావించారు. కానీ అధిష్టానం అనుభవజ్ఞుడైన సిద్ధరామయ్యకు పదవి ఇచ్చింది. ఆ సమయంలోనే రెండున్నరేళ్ల తర్వాత డీకేను సీఎం చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే సిద్ధరామయ్య సీఎంగా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు అవుతోంది. ఈ క్రమంలో డీకే వర్గం ఒత్తిడితో అధిష్టానం దిగివచ్చింది.

## రూ. లక్ష ఇస్తే రీఎగ్జామ్ పేపర్ అంటూ కొత్త స్కామ్..





**అక్షరటుడే, ఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పేపర్ లీక్ వివాదంపై ఒకవైపు సీబీఐ ముమ్మర దర్యాప్తు జరుపుతుండగానే, సోషల్ మీడియాలో మరో కొత్త మోసం మొదలైంది. జూన్ 21న జరగబోయే 'నీట్ రీఎగ్జామ్' క్వశ్చన్ పేపర్లు తమ వద్ద ఉన్నాయంటూ కొన్ని ముఠాలు సోషల్ మీడియాలో ఓపెన్‌గా ఆఫర్లు పెడుతున్నాయి. ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌లోని కొన్ని ఛానళ్లు ఈ దందాకు తెరలేపాయి. పరీక్షల షెడ్యూల్‌ను బట్టి రూ. 80,000 నుంచి రూ. లక్ష వరకు చెల్లిస్తే రీఎగ్జామ్ పేపర్ ఇస్తామంటూ విద్యార్థులను నమ్మిస్తున్నాయి. ఈ డబ్బును ఇన్‌స్టాల్‌మెంట్లలో కూడా చెల్లించవచ్చని ఆఫర్ ఇస్తున్నాయి. సుమారు 900 మంది సబ్‌స్క్రైబర్లు ఉన్న ఒక టెలిగ్రామ్ గ్రూపులో.. 'ఎంబీబీఎస్ సీటు సాధించడానికి ఇదే మీకు చివరి అవకాశం.. వదులుకోవద్దు' అంటూ విద్యార్థులను ఆకర్షించేలా పోస్టులు పెడుతున్నారు.

## 'మహానాడు' తొలి రోజే టీడీపీకి రూ.12.44 కోట్ల విరాళాలు




**అక్షరటుడే, అమరావతి :** తెలుగుదేశం పార్టీకి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే మహానాడు కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రతి ఏడాది వేలాది మంది కార్యకర్తల సమక్షంలో వైభవంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఈసారి ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. ప్రధాని ఇచ్చిన పిలుపు మేరకు మహానాడు వర్చువల్‌గా నిర్వహిస్తున్నప్పటికీ.. పార్టీ నేతలు, కార్యకర్తల ఉత్సాహంలో మాత్రం ఎలాంటి తగ్గుదల కనిపించలేదు. రెండు రోజుల పాటు జరగనున్న మహానాడు కార్యక్రమం తొలి రోజే భారీ విరాళాలతో హాట్ టాపిక్‌గా మారింది. బుధవారం జరిగిన కార్యక్రమంలో పార్టీకి మొత్తం రూ.12.44 కోట్ల విరాళాలు అందినట్లు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి మహానాడు కావడంతో నేతలు, ప్రజాప్రతినిధులు పోటీ పడి మరీ విరాళాలు ప్రకటించారు.

## రబ్బరు బోటులో 30 గంటల జర్నీ..




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** చైనా ప్రభుత్వ కళ్లు గప్పి, ఒక చిన్న రబ్బరు పడవలో ఓ మాజీ పోలీసు అధికారి ఏకంగా 30 గంటల పాటు సముద్రంపై ప్రాణాలకు తెగించి ప్రయాణించారు. స్వేచ్ఛ కోసం, తన కుటుంబాన్ని కలుసుకోవడం కోసం ఆయన చేసిన ఈ 'డేరింగ్ జర్నీ' నెటిజన్లను ఆశ్చర్యపరుస్తోంది. చైనాలో ఉంటే తనకు స్వేచ్ఛ దొరకదని భావించిన డాంగ్, 2015లో తన కుటుంబంతో కలిసి థాయ్‌లాండ్‌కు పారిపోయారు. అక్కడ ఒక విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఆయన కుటుంబ సభ్యులకు కెనడా వెళ్లేందుకు అనుమతి లభించినప్పటికీ, డాంగ్‌ను మాత్రం థాయ్ అధికారులు తిరిగి చైనాకు పంపించేశారు. దాంతో చైనాలో ఆయనకు మళ్లీ జైలు శిక్ష తప్పలేదు. 2019లో జైలు నుంచి విడుదలైన తర్వాత ఇటీవల చైనా సరిహద్దులు దాటేందుకు ప్రయత్నించి మరోసారి పట్టుబడ్డారు. ఆ తర్వాత విడుదలయ్యాక ఒక అత్యంత ప్రమాదకరమైన నిర్ణయం తీసుకున్నారు. చైనాలోని వెయిహై తీరం నుండి ఒక చిన్న రబ్బరు బోటులో ఒంటరిగా సముద్రంలోకి బయల్దేరారు. ఎలాంటి రక్షణ లేని ఆ పడవపై దాదాపు 30 గంటల పాటు సముద్ర కెరటాలతో పోరాడుతూ ప్రయాణించి, ఎట్టకేలకు దక్షిణ కొరియా తీరానికి చేరుకున్నారు. తీరంలో అధికారులు ఆయనను ఆధీనంలోకి తీసుకున్నారు.



## ప్రపంచానికే తలమానికంగా "ఫ్యూచర్ సిటీ"

**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రపంచానికే తలమానికంగా ఉండేలా "ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, డి.శ్రీధర్ బాబు తెలిపారు. "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టు ప్రాంతంలో గురువారం పర్యటించారు. నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనం (ఎఫ్‌సీడీఏ), యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టును ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయ ప్రారంభోత్సవానికి సంబంధించిన తేదీల పై గౌరవ ముఖ్యమంత్రి గారితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తత..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియా ప్రాంతంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఒకవైపు శాంతి పునరుద్ధరణ కోసం చర్చలు జరుగుతుండగానే.. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చాయి. హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరు దేశాల సైన్యాలు పరస్పరం దాడులకు తలపడ్డాయి. జలసంధి పరిసరాల్లోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా బలగాలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డాయి. ఈ దాడి జరిగిన కొద్దిసేపటికే ఇరాన్‌లోని కీలకమైన బందర్ అబ్బాస్ పోర్టు ప్రాంతంలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. అమెరికా దాడులకు ఇరాన్ అంతే వేగంగా స్పందించింది. గల్ఫ్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో ప్రతీకార దాడులు ప్రారంభించినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. అయితే తాము ఏ దేశంలోని అమెరికా బేస్‌లను టార్గెట్ చేశామనే వివరాలను మాత్రం ఇరాన్ అధికారికంగా వెల్లడించలేదు.